నూతన సంవత్సర శుభాకాంక్షలతో..

గుడ్‌బై 2025.. వెల్‌కం 2026 అంటూ కొంగొత్త ఆశలు.. ఆకాంక్షలతో యువత కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది. విష్‌యూ హ్యాపీ న్యూఇయర్ అంటూ ఉప్పొంగే ఉత్తేజంతో కేరింతలు కొట్టింది. కాలగమనంలో కొత్త సంవత్సరం ఆవిష్కృతమైంది. కొత్త ఆశలకు ఊపిరి పోస్తూ.. అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తోంది. గత అనుభవాలను నెమరవేసుకుంటూ నూతనోత్సాహంతో జిల్లా వాసులు కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టారు.

కొత్త ఏడాదిలో కష్టాలు తీరేనా..!

2025 సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరం 2026లోకి జిల్లా ప్రజానీకం అడుగుపెట్టారు. తమ బతుకులు ఈ ఏడాదిలోనైనా మారాలని కోరుకుంటూ ఎన్నో ఆశలతో కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్నారు. జిల్లా ప్రజానీకాన్ని దీర్ఘకాలంగా పట్టిపీడిస్తున్న సమస్యలు ఈ ఏడాదైనా ప్రభుత్వం పరిష్కరిస్తుందా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలో తాగునీటి సమస్య నుంచి నిత్యావసరాల ధరల భారం వరకూ అనేక సమస్యలతో జనం సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం సమస్యలపై దృష్టి సారించి 2026లో ప్రజలు సంతోషంగా గడిపేలా చేస్తుందో.. లేదో వేచిచూడాలి.

- సామాన్యులపై నిత్యావసరాల ధరల భారం
- కౌలురైతుల కన్నీటి వ్యథలు
- నిండా మునిగిన పోలవరం నిర్వాసితులు
- కొల్లేరు సమస్యకు మోక్షం లభించేనా
- డెల్టా ఆధునికీకరణ జరగక రైతుల కష్టాలు
- గుక్కెడు తాగునీటి కోసం నానావస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రస్తుతం ప్రజలు నిరంతరం ఎదుర్కొంటున్న సమస్యల్లో నిత్యావసరాల ధరల భారం అతిపెద్దది. కడుపు నిండా పట్టెడన్నం తినలేని పరిస్థితి సామాన్య కుటుంబాల్లో నెలకొంది. కందిపప్పు, మినపప్పు, పచ్చిశనగపప్పు, వంటనూనె ధరలు అన్నీ కిలో దాదాపు రూ.150 అంతకుపైగా పలుకుతున్నాయి. వేతనాలు తగ్గిపోగా ధరలు మాత్రం అందనంత ఎత్తుకు పెరిగాయి. జిఎస్‌టి తగ్గించినట్లు కేంద్రంలోని మోడీ సర్కార్ ఊదరగొడుతున్నా.. నిత్యావసర వస్తువుల ధరల్లో మార్పు రాకపోగా, మరింత పెరిగిన పరిస్థితి ఉంది. గతంలో నెలకు రూ.రెండు వేలు బడ్జెట్ పెట్టే కుటుంబం ఇప్పుడు రూ.నాలుగు వేల వరకూ వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూరగాయల ధరలు సైతం భారీగా పెరగడంతో వారం నాడు సంత చేయాలంటే కనీసం రూ.700 వరకూ ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఆక్వా పరిశ్రమలతోపాటు అనేక పరిశ్రమల్లో రోజంతా పని చేసినా రూ.250 నుంచి రూ.300 వరకూ మాత్రమే వేతనం అందుతోంది. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు రూ.పది నుంచి రూ.15 వేల వరకూ మాత్రమే ఉన్నాయి. పిల్లల చదువులు, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో సామాన్య కుటుంబం సరైన తిండితినే పరిస్థితి లేదు. 2026లోనైనా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని అంతా ఎదురుచూస్తున్నారు.

కౌలు రైతుల కన్నీటి వ్యథ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యవసాయసాగులో 80 శాతం కౌలురైతులే సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందించాల్సిన రూ.20 వేలు ఏడాదిన్నర గడిచినా ఇవ్వలేదు. భూయజమానులకు రెండు విడతలు జమ చేసిన ప్రభుత్వం కౌలురైతులను పూర్తిగా విస్మరించింది. పంట నష్టం, బీమా పరిహారం సైతం భూయజమానుల ఖాతాల్లోనే వేసింది. దీంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పుల పాలై కన్నీరుమున్నీరుగా కౌలురైతుల కుటుంబాలు విలపిస్తున్నాయి. కొత్త సంవత్సరంలోనైనా అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ చేయడంతోపాటు కౌలురైతులకు పంట నష్టపరిహారం, బీమా వంటివి అందేలా చర్యలు తీసుకోవాలని కౌలురైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పోలవరం నిర్వాసితుల కష్టాలు తీరేనా..

చింతలపూడి పనులు జరిగేనా

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. కొంతమేర పరిహారం జమ చేసినా ఇంకా అనేక కుటుంబాలకు భూమికి భూమి, 18 ఏళ్ల నిండిన యువతకు పరిహారం ఇవ్వలేదు. 41.15 కాంటూరు పరిధిలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలను ఖాళీ చేయిస్తామని చెప్పినా ఇప్పటికీ జరగలేదు. ఇప్పటికీ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వడంగాని, గృహనిర్మాణాలు పూర్తి చేయడంగాని లేదు. దీంతో ప్రతియేటా జులై, ఆగస్టుల్లో వచ్చే వరదలకు పోలవరం నిర్వాసితులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. నిర్మించిన కాలనీల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు, ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ఏడాదిలోనైనా నిర్వాసితుల కష్టాలు తీర్చాలని అంతా ఆశగా కోరుతున్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తిగా పడకేశాయి. దీంతో మెట్ట ప్రాంతంలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, అనేక గ్రామాలకు తాగునీరు అందకుండాపోయింది. భూసేకరణ చేసిన రైతులకు పరిహారం ఇవ్వలేదు. 2026లోనైనా చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించి పనులు మొదలు పెట్టాలని రైతులు కోరుతున్నారు.

కొల్లేరు సమస్య తీరేనా

కొల్లేరు ప్రజల సమస్యలు తీరుస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కేంద్ర సాధికారిక కమిటీ కొద్దినెలల క్రితం కొల్లేరులో పర్యటించింది. అక్కడి ప్రజల కష్టాలను నేరుగా చూసింది. వినతిపత్రాలు స్వీకరించింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అక్కడి ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. 120 గ్రామాలకు చెందిన దాదాపు ఐదు లక్షల జనాభా కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. కొల్లేరు సమస్యను పరిష్కరించి తమకు ఉపాధి కల్పించాలని కొల్లేరువాసులు కోరుతున్నారు. కొత్త ఏడాదిలోనైనా కొల్లేరు సమస్యకు పరిష్కారం చూపుతారో, లేదో చూడాల్సి ఉంది.

గుక్కెడు తాగునీటి కోసం అవస్థలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని డెల్టా ప్రాంతంలో గుక్కెడు తాగునీరు దొరకని పరిస్థితి ఉంది. చేపల చెరువులతో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేస్తామని దశాబ్దకాలం నుంచి చెబుతున్నా ఇప్పటికీ చేయలేదు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో వాటర్‌గ్రిడ్‌కు సంబంధించిన పనులకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ ఏడాదిలోనైనా వాటర్‌గ్రిడ్ పూర్తి చేసి తాగునీరు అందించాలని జనం కోరుతున్నారు. డెల్టా ఆధునికీరణ లేక రైతులు ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంటను కోల్పోతున్నారు. కొత్త ఏడాదిలోనైనా కాలువల ఆధునికీకరణ పనులు పూర్తి చేసి న్యాయం చేయాలని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

భవిష్యత్తు అవసరాలకు పింఛను దాచుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - పాలకోడేరు

సామాజిక పింఛను సొమ్మును భవిష్యత్తు అవసరాల కోసం లబ్ధిదారులు ఖర్చులు పోను ఎంతో కొంత దాచుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కుముదువల్లి చినపేటలో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఒక రోజు ముందుగానే బుధవారం వేకువజామునే ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ సందర్భంలో జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల క్షేమ సమాచారాన్ని, ఆరోగ్య విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను అరికట్టవచ్చుని, తద్వారా అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని హితవు పలికారు. జిల్లా వ్యాప్తంగా 20 రకాల పెన్షన్లకు సంబంధించి రూ.97.19 కోట్లు 2,25,521 మంది లబ్ధిదారుల ఇంటి వద్దకెళ్లి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్ వేణుగోపాల్, ఎపిఒ ఎం.శ్రీనివాసప్రసాద్, ఎంపిడిఒ రెడ్డియ్య, తహశీల్దార్ ఎన్.విజయలక్ష్మి, సర్పంచి భూపతి రాజు వంశీకృష్ణ, ఇఒపిఆర్‌డి ఎంవిఎస్ రాంప్రసాద్, ఎంఇఒ పివిఎస్ నాగార్జున, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుముదవల్లిలో పింఛను సొమ్ము అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

నేటి నుంచి 'వాసవీ పెనుగొండ'గా పేరు మార్పు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని పెనుగొండ గ్రామం పేరును ఇకపై వాసవీ పెనుగొండగా పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామ పేరులో మార్పు చేస్తూ ప్రభుత్వం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపిడిఒ టి.సూర్యనారాయణ వాసవీ పెనుగొండ అని పేరును ఐరన్ బోర్డుతో సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ పేరు మార్పు బుధవారం నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఇకపై అన్ని ప్రభుత్వ రికార్డులు, అధికారిక పత్రాలు, అభివృద్ధి కార్యక్రమాలు, లేఖా వ్యవహారాల్లో గ్రామాన్ని వాసవీ పెనుగొండగా పేర్కొనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామ చరిత్ర, స్థానికుల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పేరు మార్పుతో గ్రామానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాసవీ పెనుగొండ బోర్డు పెడుతున్న ఎంపిడిఒ

భీమవరంలో ట్రూజోన్ సోలార్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భారత్‌లో సోలార్ విద్యుత్ చాలా వేగంగా విస్తరిస్తోందని, ఎక్కడ చూసినా సోలార్ ప్యానెల్స్ కనిపిస్తున్నాయని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం, విస్సాకోడేరు వంతెన వద్ద ట్రూజోన్ సోలార్ షోరూంను ఎంఎల్‌ఎ బుధవారం ప్రారంభించారు. రాష్ట్రంలో 16వ బ్రాంచ్‌ను ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. పర్యావరణంతోపాటు విద్యుత్ ఆదా చేయడంలో సౌర ఫలకాలు ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నాయన్నారు. విద్యుత్ సౌకర్యం లేని చోట, సోలార్ ప్యానెల్స్ ప్రతి గ్రామంలో ప్రకాశిస్తున్నాయన్నారు. ట్రూజోన్ స్టేట్ హెడ్ ఎం.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 17 ఏళ్లగా వివిధ రాష్ట్రాల్లో ట్రూజోన్ విస్తరించి ఉందని, భీమవరంలో 16వ బ్రాంచ్‌ను ప్రారంభించుకున్నామని తెలిపారు. భీమవరం హెడ్ బి.రాజేంద్రకుమార్, గూడూరి రాజేష్ మాట్లాడుతూ సోలార్‌తో మీ ఇంటిని కాంతివంతంగా చేసుకోవచ్చన్నారు. అతి తక్కువ ధరకే సోలార్ అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు కాంస్యం

ప్రజాశక్తి - భీమవరం

తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం మండలం వెదరేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల 27 నుంచి 29వ తేదీ వరకూ జరిగిన 10వ రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీల్లో జిల్లా పురుషులు, మహిళల జట్లు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారని జిల్లా నెట్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీవిజయలక్ష్మి తెలిపారు. రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల జట్టు నుంచి జిఎన్‌విఎస్.విజయకుమార్ (కెప్టెన్), పూడి.శ్రీనివాసు (వైస్ కెప్టెన్), ఎస్.దానియేలు, ఎం.ఎర్నెస్ట్, ఎ.వెంకటేష్, డి.ఫణింద్రకుమార్, పి.మిన్ను, టి.దుర్గాప్రసాద్, జి.త్రినాథ్ పురుషుల జట్టు నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు కాంస్య పతకాన్ని అందించారు. మహిళల జట్టు నుంచి జి.వరలక్ష్మి (కెప్టెన్) డి.నాగ నవ్య (వైస్ కెప్టెన్), కె.అక్షయ, కె.మానస, టి.ఉమా భవాని, డి.జోష్ నాగసాయి, కె.శ్రీదేవి, ఎన్.గంగాభవాని, పి..జ్యోతి, కె.మౌనిక, రాము రాణించి కాంస్య పతకం గెలిచారని మాజీ రాష్ట్ర కోశాధికారి, జిల్లా ఎన్ఐఎస్ కోచ్ పి.దావూద్‌ఖాన్ తెలిపారు. వారిని జిల్లా వైస్ ప్రెసిడెంట్ మేడిది జాన్సన్, సంఘం సభ్యులు వి.వినీత్ జోసఫ్‌కుమార్, జి.రామకృష్ణ, కె.సుధీర్ అభినందించారు.

కొత్త సంవత్సరానికి ఆఫర్ల సందడి

ప్రజాశక్తి - ఆచంట

కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికేందుకు ఆచంట మండల ప్రజలు షాపింగ్‌లో బిజీబిజీ అయ్యారు. దీంతో మార్కెట్లో పూల బొకేలు, పూల దండలు, కేకులు, స్వీట్లు, పండ్లకు గిరాకీ పెరిగింది. మరికొద్ది గంటల్లో 2026వ సంవత్సరంలో అడుగు పెడుతున్న తరుణంలో మార్కెట్లు కళకళ లాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ షాపుల్లో సందడి నెలకొంది. ఇక బిర్యానీ సెంటర్లు అయితే ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అంటూ ఆఫర్లతో హోరెత్తిస్తున్నారు. ప్రభుత్వ పెన్షన్లు అందుకోవడం వల్ల మార్కెట్‌కు గిరాకీ పెరిగింది. మహిళలు ఇంటి ముంగిట నూతన సంవత్సరం ముగ్గులు వేయడానికి రకరకాల రంగులతో దుకాణాలు వెలిశాయి. విద్యార్థులు న్యూఇయర్ గ్రీటింగ్స్ ఇచ్చి పుచ్చుకునేందుకు ఫ్యాన్సీ షాపులు కళకళ లాడుతున్నాయి. మహిళలు ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు.

రద్దీగా ఉన్న ఆచంట కచేరీ సెంటర్

4న కార్మిక సభకు కదలిరండి

జోరుగా సిఐటియు అఖిల భారత మహాసభ ప్రచారం

తణుకులో రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ

నూజివీడులో మోటారు సైకిల్ ర్యాలీ

సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా జనవరి 4న విశాఖపట్నంలో జరగనున్న ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులంతా కదిలి రావాలని నేతలు పిలుపునిచ్చారు. రెండు జిల్లాల్లో బుధవారం సిఐటియు నేతలు వివిధ రూపాల్లో ప్రచారం నిర్వహించారు. తణుకులో రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేయగా, నరసాపురం మండలంలో అంగన్వాడీలు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. నూజివీడులో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించచగా, కొయ్యలగూడెంలో పంచాయతీ కార్మికులు సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు.

ప్రజాశక్తి - తణుకు

జనవరి 4న విశాఖపట్నంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ విజయవంతం కావాలని పట్టణ కమిటీ ఆధ్వర్యాన బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో 200 మంది రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, 4న జరిగే బహిరంగ సభ జయప్రదం చేయాలని పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా ప్రతాప్, మండల కన్వీనర్ గుబ్బల గోపి మాట్లాడుతూ నేడు కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్‌లో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. కార్మికుల హక్కులు తొలగించి, కార్పొరేట్లకు బానిసలుగా మార్చాలనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్, ఛైర్మన్ వల్లూరి గంగయ్య, కమిటీ సభ్యులు సుంకర ప్రసాద్ చేతుల మీదుగా ఫుడ్ ప్యాకెట్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో నేతలు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, కె.నాగరత్నం, భాస్కర్‌రావు, అంజిబాబు, ఎం.గంగాధర్‌రెడ్డి, ఎం.రమేష్, అంబటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తణుకు : ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు అందజేస్తున్న సిఐటియు నేతలు

నరసాపురం: 4న విశాఖలో జరిగే సిఐటియు బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పిఎంలంకలోని డిజిటల్ భవనం వద్ద అంగన్వాడీల ఆధ్వర్యాన సభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో వి.వెంకటలక్ష్మి, భోగేశ్వరి, విజయలక్ష్మి, ముత్యాలమ్మ, రాజేశ్వరి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

నరసాపురం : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

నూజివీడు టౌన్: సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో బుధవారం సాయంత్రం నీ సిఐటియు కార్యాలయం నుండి నూజివీడు పట్టణంలోని మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ చినగాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్, శ్రీనివాస సెంటర్, సబ్ కలెక్టర్ కార్యాలయం మీదుగా పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా సాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ అఖిలభారత 18వ మహాసభ మొట్టమొదటిసారి కార్మికవర్గ కేంద్రమైన విశాఖ నగరంలో జరుగుతుందని, జనవరి 4న జరిగే బహిరంగ సభకు నూజివీడు ప్రాంతం నుండి వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: సిఐటియు అఖిలభారత మహాసభ సందర్భంగా ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ నిర్వహించారు. గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరి 4న చలో విశాఖపట్నం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలా రాములమ్మ, హైమావతి, సింహాచలం, నూకాలమ్మ, లక్ష్మీ భాస్కరరావు, మౌలాలి, షేక్ బాజ్జి, ఆరేటి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలి

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవంలో నేతలు

ప్రజాశక్తి - పెనుగొండ

దేశంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యను కార్పొరేట్, ప్రయివేటు శక్తులకు ధారాదత్తం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఐక్యంగా పోరాడాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా ఉపాధ్యక్షులు, ఎస్‌విఎన్.శర్మ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల వద్ద బుధవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్రం - ప్రజాస్వామ్యం - సోషలిజం నినాదాలు గల పతాకాన్ని మండల నాయకులు షేక్ ఖలీఫ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను సంఘటితం చేస్తూ నిరంతరం సమరశీల ఉద్యమాలు నిర్వహించి ఎన్నో విజయాలను సొంతం చేసుకున్న ఘనత ఎస్ఎఫ్ఐకు ఉందని కొనియాడారు. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యారంగాన్ని బలోపేతం కోసం విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. అందులో భాగంగానే కేంద్రంలో మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి బలవంతంగా రాష్ట్రాల్లో అమలు చేస్తోందన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న పేద విద్యార్థులంతా విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును సర్వ నాశనం చేసే నూతన జాతీయ విద్యావిధానాన్ని కూటమి ప్రభుత్వం నిసిగ్గుగా అమలు చేయడం ప్రభుత్వ విద్యా వ్యవస్థకు తూట్లు పొడవడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. [illegible] పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.గణేష్, ఎస్.దుర్గా ప్రసాద్, బి.లోకేష్, కె.ప్రమోద్, భరణిరాజు, కె.మణికంఠస్వామి, కె.రాకేష్‌కుమార్, బి.మణికంఠ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల దీపిక ప్రజాశక్తి

క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా ఉద్యమాల దీపిక ప్రజాశక్తి పత్రిక అని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక పిడిఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రజాశక్తి పశ్చిమగోదావరి జిల్లా 2026 నూతన క్యాలెండర్‌ను యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజుతో కలిసి బుధవారం ఆవిష్కరించి మొదటి క్యాలెండర్‌ను ప్రజాశక్తి జిల్లా రిపోర్టర్ ఉండ్రు నరేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గోపీ మూర్తి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి పత్రికలు వారధిగా పనిచేస్తాయని తెలిపారు. ప్రజాశక్తి పత్రిక ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకుల సమస్యలు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నూతన హంగులతో రంగవల్లులతో నూతన క్యాలెండర్ అద్భుతంగా తీసుకొచ్చారని ప్రజాశక్తి యాజమాన్యాన్ని సిబ్బందిని అభినందించారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజాశక్తి పత్రిక మరింత అభివృద్ధి చెంది పత్రికా రంగంలో నూతన ఒరవడికి నాంది పలకాలని పేర్కొన్నారు. ప్రజాశక్తి యాజమాన్యానికి, ఉద్యోగులకు, సిబ్బందికి, విలేకరులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం టౌన్ విలేకరి గూడూరి నాగరాజు, కార్మిక నాయకులు ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు.

కాళ్లకూరులో ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

కాళ్ల: ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న ప్రజాశక్తి దినపత్రిక 2026 క్యాలెండర్‌ను బుధవారం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు కాళ్లకూరులో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో ప్రజాశక్తి దినపత్రిక విజయవంతంగా ప్రజల గొంతుక వినిపిస్తోందని, ప్రజాశక్తి దినపత్రిక విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తోందన్నారు. ప్రజాశక్తి క్యాలెండర్లో వేస్తున్న సీనరీలు, డిజైన్లు చాలా చక్కగా ఉంటాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ అడ్డాల నాగరాజు, భీమవరం జిల్లా సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి పెద్దిరాజు, కాళ్ల విలేకరి గొట్టేటి శ్రీనివాసులు, చిన్నారులు జగత్, శౌర్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దాట్ల వెంకట రామరాజు

విశాఖపట్నంలో బుధవారం ప్రారంభమైన సిఐటియు అఖిల భారత మహాసభకు ప్రతినిధులుగా పశ్చిమగోదావరి నుంచి హాజరైన కె.రాజారామ్మోహన్‌రాయ్, జి.వాసుదేవరావు (ముందు వరుస), ఏలూరు జిల్లా నుంచి హాజరైన [illegible] (రెండోవరుస)

వాణి పబ్లిక్ స్కూల్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బొలిశెట్టి

వాణి పబ్లిక్ స్కూల్ క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో బుధవారం వాణి పబ్లిక్ స్కూల్ అధినేత వాణీకృష్ణ విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వాణి పబ్లిక్ స్కూల్ వారు ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా డిజైన్ చేసి సబ్కా మాలిక్ ఏక్ హై అని కులమతాలకు అతీతంగా ప్రత్యేక అంశాలతో ముద్రించి ఇలా ఆవిష్కరించటం అభినందనీయమని అన్నారు. అనంతరం ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాణి కృష్ణ మాట్లాడుతూ వాణి పూర్వ విద్యార్థులు అనేక రంగాలలో ఉన్నతులుగా స్థిరపడి పట్టణానికి కీర్తి ప్రతిష్టలు తేవడం ఎంతైనా గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పైబోయిన వెంకట్రామయ్య, జాగా బత్తుల బాలాజీ, ఉపాధ్యాయులు ఎం.రాజా బాబు, జాగర్లపూడి వెంకట కృష్ణమోహన్, సుస్మిత వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

ఆచంట: గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై దృష్టి సారించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు విధిగా చెత్త కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఎప్పటి నుండో పేరుకు పోయిన వ్యర్థాల గుట్టలు జనవరి 4వ తేదీ లోపు పూర్తిగా తొలగించి గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 5న అన్ని గ్రామాల్లో స్టాట్యూటరి గ్రామసభలు నిర్వహించి గ్రామంలో చేపట్టిన శానిటేషన్ డ్రైవ్, అదేవిధంగా ఉపాధి హామీ చట్టం స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన వికసిత భారత్ రోజ్ గార్, అజీవికా మిషన్(గ్రామీణ్)పై ప్రజా ప్రతినిధులు, ప్రజలు, ఉపాధి హామీ శ్రామికులకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఇ ఏడుకొండలు, డిప్యూటీ ఎంపిడిఒ సూరన్న, పంచాయతీ కార్యదర్శులు నరసింహారావు, హనుమంతరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎఐపై అవగాహన

నరసాపురం: మండలంలోని సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(అటానమస్) కళాశాలలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగం ఆధ్వర్యాన స్టూడెంట్ కెరీర్ గైడెన్స్ మీద ఇంట్రాక్షన్ సెషన్ నిర్వహించారు. విద్యార్థులకు ఎఐ టూల్స్, స్టార్టప్స్ మీద రిసోర్స్ పర్సన్ తేజ దామోదరమ్ బవిరిశెట్టి, ప్రిన్సిపల్ ఇంజినీర్ బ్రాడ్ కామ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపిచంద్, ఎఐ అండ్ ఎమ్ఎల్ విభాగాధిపతి డాక్టర్ బొమ్మ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎపిఎంసిఎడబ్ల్యుజి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

భీమవరం : జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్ మెడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అండ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షులుగా గమిడి శైలజ, అధ్యక్షులుగా కొండపల్లి వెంకట సూర్య వరప్రసాద్, జనరల్ సెక్రెటరీగా రుద్రరాజు విజయ సీతారామరాజు, జాయింట్ సెక్రెటరీగా వినీల సౌమ్య, కోఆర్డినేటర్‌గా బెల్లంకొండ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించిన అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గం సిహెచ్‌ఒలకు అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సేవా దృక్పథంతో పని చేయాలని కోరారు.

జెడ్‌పి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

ఉండి: జెడ్‌పి నిధులు రూ.50 లక్షలతో ఉండి అడ్డపర్రు పుంతలో సీసీ రహదారి నిర్మించడానికి బుధవారం సాయంత్రం స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ రైతుల ఇబ్బందుల దృష్ట్యా అడ్డపర్రు పుంత లో జెడ్‌పి నిధులు రూ.50 లక్షల వ్యయంతో సీసీ రహదారి నిర్మించడం జరుగుతుందని, దీనిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉండి భవానిపేటలో పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, నాయకులు రణస్థుల మహంకాళి, కన్నెగంటి రూత్ కళ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

తహశీల్దార్ అప్పారావు

గణపవరం: ఈనెల 2వ తేదీ నుండి మండలంలో రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు రైతులకు అందజేస్తారని గణపవరం తహశీల్దార్ వై.అప్పారావు బుధవారం చెప్పారు. మండలంలో చిలకంపాడు, చినరామచంద్రపురం, గణపవరం, జగన్నాధపురం, జల్లికాకినాడ, కొత్తపల్లి, సరిపల్లి, వాకపల్లి, వరదారాజపురం, వెలగపల్లి గ్రామంలో రెండు నుండి 9వ తేదీ వరకు పాస్ పుస్తకాలు పంపిణీ జరుగుతుందని, పంపిణీ సమయంలో భూ యజమాని కాని, అతని కుటుంబ సభ్యులు ఎవరో ఒకరు హాజరు కావాలని చెప్పారు. [illegible]

మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించండి : ఎంపిపి

ఉండి: మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే మండలాభివృద్ధి జరుగుతుందని ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. బుధవారం ఉండి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో [illegible]

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన నూతన సంవత్సర వేడుకలు

పాలకొల్లు : [illegible]

పర్యావరణ పరిరక్షణకు కృషి : ఎంపిడిఒ

మొగల్తూరు: [illegible]

విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు

మొగల్తూరు: [illegible]

నూతన సంవత్సర వేడుకలకు మంత్రి దూరం

పాలకొల్లు: 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈనెల 1న [illegible]

హాట్ కేక్.. భలే క్రేజ్

అతిథిలా వచ్చి అనుబంధంగా మారిన కేకులు
రోజురోజుకూ పెరుగుతున్న వినియోగం
తయారీతో ఉపాధి అవకాశాలు
నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబైన కేకులు

ప్రజాశక్తి - కాళ్ల

పుట్టిన రోజు అయినా, పెళ్లి రోజు అయినా.. వేడుక ఏదైనా సరే అక్కడ కేకు వుండాల్సిందే. ఇటీవల కాలంలో క్రేజీ పెరిగింది. మొదట్లో పుట్టిన రోజులకే కేక్‌ను వినియోగించేవారు. ఇప్పుడు ఏ సందర్భమైనా కేక్‌తో కేక పుట్టిస్తున్నారు. ఏ శుభకార్యంలో అయినా ఈ హాట్ హాట్ కేక్ కట్ చేయకపోతే సెలబ్రేషన్స్ పూర్తి కానట్లే లెక్క. ఇలా ప్రతి ఒక్క కార్యంలో ప్రాధాన్యత పెరగింది. ఫెస్ట్, మ్యారేజ్ ఇలా ఒక్కటి రెండు కాదు.. ఏ సంతోషమైనా కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ చేసుకోవడం రివాజుగా మారింది. సుతిమెత్తగా, తియ్యతియ్యగా వుండే కేకులంటే ఎవరికి మాత్రం నోరూరదు చెప్పండి. అందుకే వాటికి భలే డిమాండ్ ఉందండోయ్.

2025కు గుడ్ బై చెబుతూ, 2026ని స్వాగతించేందుకు కేక్‌లు ముస్తాబవుతున్నాయి. డిసెంబర్ 31, జనవరి 1 ఈ రెండు రోజుల్లో కేక్‌లు హాట్ కేకుల్లా అమ్ముడుపోనున్నాయి. దాదాపు నూతన సంవత్సరం సందర్భంగా అన్ని రకాల వ్యాపారాలు 20 కోట్ల పైనే అమ్మకాలు జరుగుతాయని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

బర్త్ డేలతో మొదలు..

తొలుత జన్మదిన వేడుకలకు డబ్బున్న వారింట్లో బంధువులు, మిత్రులను ఆహ్వానించి జరుపుకునేవారు. పిల్లల తలపై అక్షింతలు చల్లి నిండు నూరేళ్లు జీవించమని దీవిస్తుంటారు. తర్వాతి కాలంలో మధ్య తరగతి వారు కూడా జరుపుకుంటున్నారు. జన్మదిన వేడుకల్లో మాత్రమే కట్ చేసే కేకు ఇప్పుడు ఇంట్లో ఏ వేడుక జరిగినా కట్ చేయాల్సిందే. ఇలా ప్రతి ఇంట్లో జన్మదిన వేడుకల్లో, సంబరాలు చేయడంతో కేక్స్‌కు భారీగా డిమాండ్ పెరిగిపోయింది. పట్టణ, జిల్లా, మండల కేంద్రాల్లో మారిన తరువాత గల్లీకో బేకరీ ఏర్పాటైంది. డిమాండ్ పెరిగిపోవడంతో కేక్‌లను వెరైటీగా తయారుచేయడం మొదలెట్టారు. గతంలో కేక్ ముక్కలు మాత్రమే విక్రయించే నిర్వాహకులు ప్రస్తుత కాలంలో పూర్తిస్థాయిలో తయారు చేస్తూ ఫైనాపిల్, చాక్లెట్ కేట్, కూల్కెట్, బటర్‌స్కాచ్, బ్లాక్ ఫారెస్టు, స్ట్రాబెల్లీ, పిస్తా, వెనీలా ఫ్లేవర్లతో మార్కెట్లలో అందుబాటులో ఉన్నాయి. రోజుకో వెరైటీతో కేక్‌లు మార్కెట్లోకి వస్తున్నాయి.

పెరిగిన డిమాండ్..

గతంలో జన్మదిన వేడుకలు, పెళ్లి వేడుకలకు మాత్రమే కేక్లను అమ్మేవారు. ప్రస్తుతం నూతన సంవత్సర వేడుకలు, క్రిస్మస్ వేడుకలు, స్వదేశాగమనం సందర్భంగా ప్రజలు కేజీలు కొనుగోలు చేస్తున్నారు. వారి వారి ఇష్టానికి, మారిన ట్రెండ్‌కు అనుగుణంగా పలు రకాల ఫ్లేవర్లతో కేక్లను తయారు చేయిస్తున్నారు. ప్రేమికులు తమ ప్రేమను వ్యక్తం చేసుకునే రోజులు కూడా గుర్తుంచుకుని కేక్ కట్ చేయడం సాధారణంగా మారిపోయింది. ఏ దినోత్సవానికైనా సరే కేక్ కట్ చేయడం ఆనవాయితీగా వస్తోంది.

నూతన సంవత్సర వేడుకల్లో ఎక్కువగా..

నూతన సంవత్సర వేడుకల్లో కేక్‌లదే అగ్రస్థానమని చెప్పాలి. ఇది అవకాశంగా తీసుమని బేకరీ యజమానులు రేట్లను పెంచినప్పటికీ ఆదరణ మాత్రం తగ్గడం లేదు. నార్మల్ రేట్లు కేజీ ఒక్కంటికి రూ.300 ధర నుంచి 400 ధర పలుకుతుండగా కూల్ కేక్లు మాత్రం రూ. 800 నుంచి రూ.1,000 వరకు ఉంటోంది.

వివిధ రంగుల్లో తయారు చేసిన కూలింగ్ కేక్‌లు

వెరైటీలెన్నో..

కేక్ క్రేజీని గమనించిన నిర్వాహకులు ప్రజల ఇష్టాలకు అనుగుణంగా రకరకాల ఆకృతుల్లో కేక్‌లను తయారు చేస్తున్నారు. లవ్ షేప్, వివిధ ఆకృతుల్లో కేక్‌లను తయారు చేసి విక్రయిస్తున్నారు. పెళ్లిరోజుకు ఒక రకంగా, జన్మదినోత్సవాలకు ఒక రకంగా, ప్రేమను వ్యక్తం చేసుకునే రోజుకు మరొక రకంగా కేక్లను తయారు చేస్తున్నారు. ఇలా వేడుకలకు ప్రత్యేక స్థానంగా కేక్ కట్ చేసే కార్యక్రమం కొనసాగుతుంది. కాజు స్వీట్స్ కేజీ రూ.1300-1500లకు విక్రయిస్తున్నారు.

గిరాకీ బాగానే ఉంది

నంద్యాల రామరాజు(హాట్ లయన్స్ బాబు), బేకరీ యజమాని, జక్కరం

క్రిస్మస్ సందర్భంగా గిరాకీ బాగా పెరిగింది. ఫ్లమ్ కేకు, చాక్లెట్ కేక్ తయారు చేస్తున్నాం. కాజు స్వీట్స్ కూడా ఆర్డర్లు రావడంతో తయారు చేశాం. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ రంగుల్లో, వివిధ ఆకృతుల్లో కేకులను తయారు చేస్తున్నాం.

కోపల్లె క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నిరీక్షణ రాజు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాళ్ల: ఏసు క్రీస్తు ఆదర్శాలను గౌరవించడానికి క్రిస్మస్ సంతోషకరమైన సందర్భమని ఆకివీడు క్రైస్తవ ప్రార్థన మందిరం పాస్టర్ ఓ. ఏలియా పేర్కొన్నారు. మండల పరిధిలోని కోపల్లె గ్రామంలో టిడిపి నాయకులు డి.నిరీక్షణ రాజు-శిరీష ఇంటి వద్ద 10వ వార్షిక క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రెవ జి.ప్రకాష్ సభాధ్యక్షత వహించారు. క్రిసస్‌ను పురస్కరించుకొని ఇంటిపై విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రార్థనలు చేశారు. సంఘ సిఆర్.మాణిక్యాలరావు మాట్లాడుతూ ఏసు జన్మ గొప్పతనాన్ని వివరించారు. ప్రపంచ శాంతి కోసం దైవదూత ఏసుక్రీస్తు జన్మించాడని తెలిపారు. క్రిస్మస్ వేడుకలకు వచ్చిన విశ్వాసులకు ప్రేమ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ వై.డేవిడ్ రాజు, గాబ్రియేలు, రాజబాబు పాల్గొన్నారు.

పలుచోట్ల పింఛన్ల పంపిణీ

నరసాపురం: రాష్ట్రం ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఒక రోజు ముందే పెన్షన్లు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. బుధవారం నరసాపురంలోని పలు వార్డుల్లో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజుతో కలిసి పెన్షన్ పంపిణీ చేశారు. ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కోటిపల్లి వెంకటేశ్వర రావు, కొప్పాడి రవి, పోలిశెట్టి సాంబ పాల్గొన్నారు.

పెనుమంట్ర : దేశంలో ఎక్కడా లేని విధంగా ఈనెల 31నే వృద్ధులకు, వికలాంగులకు, వితంతు మహిళలకు, డయాలసిస్ రోగులకు పెన్షన్ ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వంకు దక్కుతుందని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ వైస్ ఎంపిపి కట్టా బాలాజీ వన కుమార్ అన్నారు. బుధవారం ఉదయం మండలంలోని నెగ్గిపూడి శివారు వనంపల్లిలో పలువురు లబ్ధిదారులకు సచివాలయం ఉద్యోగులతో కలిసి ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉదయం నుండి ఈ కార్యక్రమం జరిగింది.

మొగల్తూరు : మండలంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పింఛన్ లబ్ధిదారులకు 95 శాతం మందికి పంపిణీ చేసామని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని తెలిపారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగా బుధవారం పంపిణీ ప్రారంభించామన్నారు. గ్రామాల్లో 10,484 మంది లబ్ధిదారులు ఉండగా వారిలో 95 శాతం మందికి పంపిణీ పూర్తయిందన్నారు. మిగిలిన వారికి కూడా పింఛన్లు అందిస్తామన్నారు.

సిఐటియు గ్రీటింగ్ కార్డ్స్ విడుదల

వీరవాసరం : ఉద్యోగ కార్మిక కర్షక ఐక్యత మరింత బలపడాలని, 2026లో మరిన్ని ఫలితాలు సాధించాలని సిఐటియు వీరవాసరం మండల కమిటీ శుభాకాంక్షలు తెలియజేసింది. బుధవారం వీరవాసరంలో సిఐటియు, అంగన్వాడీ, ఆశ యూనియన్ నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డ్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో ఉద్యోగ కార్మికుల కర్షకుల ఐక్యత బలపడే విధంగా కృషి సాగించాలని కోరారు. దైనందిన జీవనంలో సమస్యలను అధిగమించి 2026 సంవత్సరంలో మరిన్ని విజయాలు సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 4వ తేదీన విశాఖపట్నంలో జరుగుతున్న బహిరంగ సభ దానికి నాంది కాబోతుందని అన్నారు. విద్యా, వైద్యం మరిన్ని మౌలిక సౌకర్యాలు ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి 2026 స్వాగతం తెలియజేస్తుందన్నారు.సిఐటియు మండల కో కన్వీనర్ సత్యవతి, నిర్మల, దుర్గ, భవాని పాల్గొన్నారు.

'వేడుకలను శాంతియుతంగా చేసుకోవాలి'

నరసాపురం: నూతన సంవత్సర వేడుకలను ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా జరుపుకోవాలని డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద విజ్ఞప్తి చేశారు. సబ్ డివిజన్ వ్యాప్తంగా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బైక్ రేసింగ్‌లు, అతివేగం, ప్రమాదకర రీతిలో వాహనాలు నడపడం చేయడం, సైలెన్సర్లు తొలగించి విపరీతమైన శబ్దాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇతరుల ప్రశాంతతకు భంగం కలిగిస్తే పరికరాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఒకవేళ మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే, ఆ వాహన యజమానులు, తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

ఆచంట : నూతన సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలను, ఆయురారోగ్యాలతో వెలుగులు నింపి ఆనందమయం కావాలని వైసిపి సీనియర్ నాయకులు వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. ఆచంటలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, వైసిపి నాయకులు మనవర్తి విజయ్ కుమార్, గోడవర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెనుగొండ : నూతన సంవత్సర వేడుకలను ప్రజలు సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని పెనుగొండ సిఐ విజయ్ కుమార్, ఎస్ఐ గంగాధర్ రావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల పేరుతో నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై హంగామా చేయడం, అల్లర్లు సృష్టించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చట్ట విరుద్ధ చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. కొత్త సంవత్సరాన్ని సంతోషంగా స్వాగతించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

తోట శ్రీరాములు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఉండి


దుస్తుల పంపిణీ చేస్తున్న సూర్యనారాయణ రాజు

మండలంలోని పాములపర్రు టిడిపి గ్రామ అధ్యక్షులు తోట శ్రీరాములు నిస్వార్థంగా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న సూర్యనారాయణ రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు కొనియాడారు. బుధవారం పాములపర్రు గ్రామంలో సుమారు 120 మంది వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు, పండ్లు, నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేగేశ్న సూర్యనారాయణ రాజు, జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ సుమారు పది సంవత్సరాల నుంచి తోట శ్రీరాములు నిస్వార్థంగా పెన్షన్ అందుకునే వృద్ధులకు తన వంతు సాయంగా మందుల ఖర్చులకు ప్రతి నెల తాను కూడా నగదు పంపిణీ చేయడం జరుగుతుందని, అదేవిధంగా నూతన సంవత్సరం సందర్భంగా ప్రతి ఏటా జనవరిలో వారికి దుస్తులు, దుప్పట్లు, పండ్లు అందించి మానవత్వానికి నిదర్శనగా నిలిచారని గుర్తు చేశారు. శ్రీరాములును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని తమ తమ గ్రామాల్లో ఉండే వృద్ధులకు సహకారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరిక నాగరాజు, సర్పంచ్ల ఛాంబర్ మండల అధ్యక్షులు దాసరి వెంకటకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి సతీష్ రాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇర్రింకి బుజ్జి, నాయకులు పేరిచర్ల బాలరాజు, కన్నెగంటి రూత్ కళ, ఉంగరాల నాగేశ్వరరావు, కాగిత బుజ్జి, కిన్నెర వెంకన్న, సురవరపు వెంకటాచార్యులు, కర్రి శ్రీనివాస్, నల్లా వల్లి సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్లు నక్కా చెన్నకేశవరావు, తాటిపర్తి పెదవీరప్ప శ్రీరాములను ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు

నరసాపురం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. బుధవారం నరసాపురం సూర్య జూనియర్, డిగ్రీ కళాశాలలో పర్యావరణ చట్టం 1986, డ్రగ్స్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సూర్య కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ అధ్యక్షత వహించారు. జడ్జి గంగరాజు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఒకసారి డ్రగ్ కేసులో గానీ, ర్యాగింగ్ కేసులో గానీ రిజిస్టర్ అయితే ప్రభుత్వ ఉద్యోగానికి, విదేశీ విద్యకు అనర్హులవుతారన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి కలలు కని, వాటిని సాకారం చేసుకొనేందుకు పట్టుదలతో కృషి చేసినట్లయితే తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు, ప్రఖ్యాతలు తెచ్చిన వారవుతారన్నారు. సెలవు దినాల్లో తల్లిదండ్రులకు సహాయకారులుగా ఉండాలి గానీ చెడు సావాసాలకు, చెడు అలవాట్లకు కేటాయించకూడదన్నారు. నేడు సోషల్ మీడియా ప్రభావం వల్ల చాలా మంది విద్యార్థులు సైబర్ నేరాలకు గురై మానసిక ఒత్తిళ్లకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, డ్రగ్ వాడకం చిన్నగా మొదలై ప్రాణాలు తీసుకొనే స్థాయికి దారి తీస్తుందన్నారు. సొసైటీలో గుర్తింపును కోల్పోతారన్నారు. కాబట్టి పెద్దలు, గురువులు చెప్పిన మాటలు వినాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సూర్య ప్రకాశరావు, న్యాయవాదులు పి.శ్రీనివాస్, వైడి.ఫణికర్, నరసాపురం టౌన్ సిఐ బి.యాదగిరి, కళాశాల సెక్రటరీ, కరస్పాడెంట్ ఘంటసాల బ్రహ్మాజీ మాట్లాడారు. ఈ సందర్భంగా క్లాసికల్ డాన్స్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన 9వ తరగతి తిరుమాని వాసవి దుర్గ ను జడ్జి గంగరాజు, కళాశాల యాజమాన్యం అభినందించారు. తదనంతరం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ న్యాయమూర్తి చేతుల మీదుగా కేక్ కటింగ్ చేశారు.

అభివృద్ధికి సహకరిస్తే కక్ష సాధింపులా?

అసత్య ఆరోపణలు చేయడం సరి కాదు
సంజన ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ జానీ

ప్రజాశక్తి - పాలకోడేరు

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అపార్ట్‌మెంట్లను చూపిస్తున్న జానీ

గొల్లలకోడేరు సంజన ఎస్టేట్స్‌లో ఉన్న అపార్ట్‌మెంట్లు తాను నిర్మించలేదని, అయినా సహృదయంతో సంజన ఎస్టేట్స్‌లో మౌలిక వసతుల కల్పనకు సొంత నిధులు వెచ్చించానని అయితే కొంతమంది కావాలనే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని సంజన ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ జానీ అన్నారు. సంజన ఎస్టేట్స్‌లో తనపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అపార్ట్‌మెంట్లను బుధవారం ఆయన మీడియాకు చూపించి విలేకరులతో మాట్లాడారు. రూ.80 లక్షల సొంత ఖర్చులతో కాంక్రీట్ డ్రెయినేజీ నిర్మాణం చేశానని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని పేర్కొన్నారు. సంజన ఎస్టేట్లో తనకు సుమారు మూడు ఎకరాల స్థలం ఉందని, దీన్ని ఆనుకుని ఉన్న పిచ్చి మొక్కలు, చెట్లు తొలగించడం జరిగిందని, దీనిపై అనవసరంగా రాద్ధాంతం చేసి తనపై ఫిర్యాదులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్లు, పైన పెంట్ హౌస్‌లు నిర్మాణం చేశారని, దీనిపై ఏ ఒక్కరూ మాట్లాడరని పేర్కొన్నారు. ఉన్నత కులంలో ఉన్నవాళ్లు చేస్తే ఒప్పు, చిన్న కులంలో ఉన్నవాళ్లు చేస్తే తప్పులా వక్రీకరించడం దారుణమన్నారు. తన సొంత స్థలంలో నిర్మాణానికి అడ్డుగా ఉన్న కొన్ని పిచ్చి మొక్కలను తొలగిస్తే పర్యావరణ పరిరక్షణకు తూట్లు పొడుస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. తొలగించిన మొక్కల స్థానంలో గార్డెన్ మొక్కలను సైతం ఏర్పాటు చేశామని అన్నారు. ఎస్టేట్లో పలువురు బిల్డర్లు నిబంధనలకు విరుద్ధంగా అపార్టుమెంట్లు నిర్మించారని, అనుమతులకు మించి ప్లాట్లు ఏర్పాటు చేశారని ఆరోపించారు. గృహ నిర్మాణ అనుమతులతో వాణిజ్య దుకాణాలు నిర్మించి, పంచాయతీ ఆదాయానికి సైతం గండి కొట్టారని తెలిపారు. అనుమతి, సామర్థ్యానికి మించి ప్లాట్లు నిర్మించడంతో రెండు అపార్టుమెంట్లు ఇప్పటికే కృంగి ఒక వైపునకు వరిగిపోయాయని, అవి కూలితే భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా బిల్డర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు సూచనలతో సుమారు రూ.కోటి విలువైన స్థలాన్ని మంచినీటి పథకం నిర్మాణానికి ఇచ్చేందుకు ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు పూర్తిచేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని జానీ తెలిపారు.

'ఉద్యోగుల సంక్షేమానికి కృషి'

పాలకొల్లు : ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా సంఘం పాటుపడుతుందని, దీనికి ఉద్యోగుల సహకారం ఎంతైనా అవసరమని ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు అన్నారు. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ యూనిట్ జిల్లా ఎన్నికలు పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు తణుకు యూనిట్ కార్యదర్శి జిన్నూరు శ్రీనివాస్, వైవిఎస్ బి.రాయుడు, అబ్జర్వర్‌గా జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్ఎన్.మూర్తి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నామినేషన్ స్వీకరించి, వచ్చిన వాటిని పరిశీలించి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. గుడాల హరిబాబు అధ్యక్షులుగా, గుబ్బల ప్రసాద్ కార్యదర్శిగా, కెబికె.రమేష్ రెడ్డి సహ అధ్యక్షులుగా ఆర్.రమ కిరణ్మయి కోశాధికారిగా, 15 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరిచే ప్రమాణ స్వీకారం చేయించారు. తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, MOHAMMED ASHAKHAN ALTAF, S/o SHAIK MOHAMMED ASHAKHEEN, Muslim, Male, aged 41 years, resident of H.No: 16b-14-72, Rahamath Street, 4th street, Badetinagar, Tangellamudi, Eluru, Eluru District- 534005, A.P, have changed my name from ASHAKHAN ALTAF MOHAMMED (Oldname) to MOHAMMED ASHAKHAN ALTAF (New name) and the same is intimated to General Public

రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీల్లో జెడ్‌పి విద్యార్థుల సత్తా

ఉండి: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యాన గత నెల 29వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీల్లో చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకేషనల్ విద్యార్థులు అద్భుత విజయం సాధించారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో తమ ప్రతిభను కనబరిచి జిల్లాకు, తమ పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన ప్రతిభకు గాను మెడల్స్, ప్రశంసా పత్రాలతో పాటు రూ.25 వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.అక్బర్ చక్రవర్తి బుధవారం అభినందించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో నిర్వహించే 'జాతీయ స్థాయి స్కిల్స్ పోటీల్లో కూడా పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో అందిస్తున్న వృత్తి విద్యా శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని వారు కోరారు. ఈ ప్రాజెక్టును రూపొందించి, విజయం సాధించిన విద్యార్థులు జి.దిలీప్, వి.కేశవ్ హృదయ్, డి.జోసెఫ్ రాజు, డి.సాత్విక్, వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల ఒకేషనల్ ట్రైనర్ వి.నిశాంత్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

ఎంఎల్ఎను కలిసిన మున్సిపల్ కమిషనర్

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.వెంకట్ రామ్ రెడ్డి బుధవారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ వార్డుల్లో పర్యటించి, స్థానిక ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన సమస్యలపై దృష్టి సారించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచడం, డ్రెయినేజీ వ్యవస్థను క్రమబద్ధీకరించడం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా సమర్థవంతంగా అమలు చేయాలని కమిషనర్‌కు దిశానిర్దేశం చేశారు. పట్టణాభివృద్ధిలో మున్సిపల్ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

సౌత్ జోన్ షటిల్ టోర్నమెంట్‌కు వైఎన్ విద్యార్థిని

నరసాపురం: వైఎన్ కళాశాల నుండి ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరుపున సౌత్ జోన్ షటిల్ టోర్నమెంట్‌లో ఆడేందుకు జిఎస్.శివాని ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అందే రామసతీష్ తెలిపారు. శివాని కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతుందని ప్రిన్సిపల్ సిహెచ్.కనకరావు తెలిపారు. సెక్రటరీ అందే రామసతీష్, కళాశాల వైస్ ప్రెసిడెంట్ చినిమిల్లి సత్యనారాయణ, కళాశాల అధ్యాపక బృందం, పీడీ డైరెక్టర్ నాగభూషణం నాయుడు తదితరులు శివానిని అభినందించారు.

ఆదిత్య విద్యార్థిని సావానిటిస్ కంపెనీకి ఎంపిక

పాలకొల్లు : ఆదిత్య యూనివర్సిటీ సూరంపాలెంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఆదిత్య డిగ్రీ కాలేజీ పాలకొల్లుకు చెందిన తృతీయ సంవత్సరం బిసిఎ విద్యార్థిని షేక్ రైసా సుల్తానా సావానిటిస్ కంపెనీకి ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ ఎన్.మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని, తల్లిదండ్రులను, కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.రాధాకృష్ణ, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్, సిఆర్‌టి, ఇంగ్లీష్ అధ్యాపకులను ఆదిత్య ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వెస్ట్ గోదావరి డైరెక్టర్ రాఘవ రెడ్డి అభినందించారు.

అభివృద్ధి బాటలో గ్రామాలు : ఎంఎల్ఎ

గణపవరం: కూటమి ప్రభుత్వ కృషితో గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం మండలంలోని వెంకటరాజపురం, కొత్తపల్లి, జల్లికాకినాడ గ్రామాల్లో సీసీ డ్రెయినేజీల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్డు నిర్మాణం చేయటానికి ఆదర్శ గ్రామ్ యోజన రూ.20 లక్షలు చొప్పున మూడు గ్రామాల్లో రూ.60 లక్షలు మంజూరు అయినట్లు చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలనకు వీలుగా డ్రెయినేజీలు నిర్మాణం చేయటం జరుగుతుందని చెప్పారు. అంతేకాకుండా ప్రజలకు కావలిసిన మౌలిక సదుపాయాలు కలగచేయడానికి ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు మద్దాల రత్నకుమారి, మధుసూదనరావు, మల్లంపల్లి సరేష్, బాతు నాగేశ్వరావు, ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరు మార్కెట్ కిటకిట

మొగల్తూరు: మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతం బుధవారం సాయంత్రం రద్దీగా మారింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సెంటర్ ప్రాంతంలో రంగవల్లులు, పళ్ల దుకాణాలు, ఫ్యాన్సీ దుకాణాలు వెలిశాయి. దీంతో ఇతర ప్రాంతాల నుండి వచ్చిన కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. దీంతో కొద్దిపాటి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

రద్దీగా మొగల్తూరు సెంటర్

పాస్‌పోర్టు పోయినది

ది.30-12-2025వ తేదీన నాయొక్క పాస్‌పోర్టు నెం.S9271658 గల పాస్‌పోర్టు పెదకాపవరం నుండి ఆకివీడు సెంటరుకు మోటార్‌సైకిల్‌పై వెళ్ళుచుండగా దారిలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియచేయవలసినదిగా యావన్మందికి కోరడమైనది.

కఠారి అనిత, భర్త జోసెఫ్,
పెదకాపవరం-534 235,
ఆకివీడు మండలం, ప.గో.జిల్లా జిల్లా.
సెల్: 7288010515.